

ప్రజాశక్తి బుక్ హౌస్‌లో పాఠ్య పుస్తకాల విక్రయం

ప్రజాశక్తి-విశాఖపట్నం

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, అల్లూరి (పాడేరు, అరుకు) జిల్లాల్లో 1 నుండి 10తరగతుల వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను ప్రజాశక్తి బుక్‌హౌస్‌లో విక్రయించనున్నట్లు బుక్ హౌస్ మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. అందులో భాగంగా 10వ తరగతి పాఠ్య పుస్తకాలను ఈనెల 28నుండి ప్రజాశక్తి ఆటోనగర్‌లో హోల్‌సేల్ డీలర్లకు, సోమవారం నుంచి విశాఖలోని అల్లూరివిజ్ఞాన కేంద్రంలోగల ప్రజాశక్తి బుక్‌హౌస్ లో రిటైల్ లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలు కావాల్సిన వారు 9490099061/ 9490099133 నెంబర్లను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని స్కూలు యాజమాన్యాలు, తల్లిదండ్రులు వినియోగించు కోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు పాట్లు



బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న డిఇఒ కార్యాలయ సిబ్బంది

- బదిలీ ఉత్తర్వులతో తంటాలు
- అకడమిక్ ఇయర్ పేరిట పాయింట్లలో కోత
- లబోదిబోమంటున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాశాఖలో బదిలీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 47 ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. ఈ జిఒలో పేర్కొన్న పలు అంశాలు 2015లో చేరిన ఉపాధ్యాయులకు శరగోపంగా మారింది. ఎనిమిదేళ్ల అడకమిక్ సంవత్సరాలు ఆధారంగా బదిలీలు చేపట్టనుండటంతో 2015లో చేరిన ఉపాధ్యాయులకు 22 పాయింట్లు మించి రాకపోవడంతో వందల సంఖ్యలో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. 2017లో రేషలైజేషన్‌కు గురైన వారికి ఓల్డ్ స్టేషన్ పాయింట్లతో పాటు రేషలైజేషన్ పాయింట్‌లు 5 ఇచ్చారు. ఈ విధానం జీవోలో పేర్కొన్న అంశాలకు, గత సంప్రదాయానికి విరుద్ధంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఓల్డ్‌స్టేషన్ పాయింట్‌లు ఇచ్చినా అభ్యంతరం లేదని, కానీ అదనంగా ఐదు పాయింట్లు ఇవ్వడం వల్ల మిగతా ఉపాధ్యాయులు నష్టపోతారని బాధిత ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. దీనివల్ల 15ఏళ్ల సర్వీస్ ఎక్కువ ఉన్న టీచర్ కూడా బదిలీల సీనియారిటీ జాబితాలో వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. అలా అని 8ఏళ్ల సీలింగ్ పెడితే 2013లో చేరిన ఉపాధ్యాయులు నష్టపోనున్నారు. ఈ నేపథ్యంలో 2015 వారికి తప్పనిసరి బదిలీ నుంచి తప్పించడమే మార్గమని అభిప్రాయ పడుతున్నారు.

ఉదాహరణకు.. 2015 నవంబర్ 18లోపల జాయిన్ అయిన వారికి 8 ఏళ్లకు 24 పాయింట్లు రావడం లేదు. 22.7 పాయింట్స్ మాత్రమే వస్తున్నాయి. నిజానికి 2017లో బదిలీ అయినా వారు పాఠశాలలో ఏడున్నర సంవత్సరాలు మాత్రమే పూర్తి చేసుకున్నారు. కానీ తాజా జీవో ప్రకారం 8 అకడమిక్ సంవత్సరాలు అని చెప్పి వారిని బలవంతంగా బదిలీకి దరఖాస్తు చేయమన్నారు. వారికి 8ఏళ్ల పూర్తయ్యాయని బదిలీ చేస్తున్నారు. కానీ వీరికి 8 ఏళ్లకు రావాల్సిన పాయింట్లు రాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. బదిలీలలో ఇటువంటి అసంబద్ధ నిబంధనలుఉపాధ్యాయులకు నష్టం కలిగించేవిగా ఉన్నాయని రూల్స్ ని వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బదిలీలకు ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తు గడు వు శుక్రవారం రాత్రి తో ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,294 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ప్రధానోధ్యాయులు 138 మంది, స్కూల్ అసిస్టెంట్లు 1,979 మంది, ఎస్‌జిటిలు 2,177 మంది ఉన్నారు. శనివారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. బదిలీల సమస్యల పరిష్కారానికి డిఇఒ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంఏర్పాటు చేశారు.

అసంబద్ధ జిఒకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి అసంబద్ధమైన నిర్ణయాలు, జిఒలో ఉన్న లోపాలను సవరించాలని కోరుతూ ఆదివారం ఉదయం ఉమ్మడి జిల్లా విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనకు ఫ్యాప్టో పిలుపునిచ్చింది. అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులను మాన్యువల్‌గా మాత్రమే నిర్వహించాలని, బదిలీలలో అసంబద్దాలను తొలగించి, పోస్టులను బ్లాక్ చేయకుండా ఖాళీలన్నింటినీ ప్రదర్శించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటరావు, డి.శ్యామ్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

9 రోడ్లకు అటవీ అనుమతులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లా అటవీ హక్కుల కమిటీ మరో తొమ్మిది రోడ్లకు అటవీ అనుమతులు (ఫారెస్ట్ క్లియరెన్స్) మంజూరు చేసింది. జిల్లా అటవీ హక్కుల కమిటీ కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమావేశమైంది. ఈ సమావేశంలో విస్తృతంగా సమీక్షించి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం ఆవస్యమని భావించి తొమ్మిది రోడ్లకు అనుమతులు జారీ చేశారు. ఇందులో భామిని మండలం మనిగ నుండి అంటిజోల వరకు (శ్రీకాకుళం జిల్లా వరకు), నడిమిగూడ కాలనీ నుండి గేదెలగూడ వరకు, కొత్తగూడం నుండి నడిమిగూడ వరకు, దిమ్మిడిజోల నుండి కొత్తగూడం వరకు, డోకులగూడ కాలనీ నుండి శ్రీకాకుళం జిల్లా సరిహద్దు వరకు, సీతంపేట మండలంలో రేగులగూడ నుండి పాతపెద్దగూడ, పాతరంగం వలస నుంచి రంగంవలస వరకు, పెద్దగూడ నుంచి పాతరంగంవలస వరకు రహదారులకు అటవీ అనుమతులు మంజూరు చేశారు. ఈ రహదారు లను పిఎంజిఎస్‌వై - ఆర్‌సిపిఎల్.డబ్ల్యూఇ గ్రాంటు రూ.17.06 కోట్లతో 21.50 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నారు. ఇందులో 8.55 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. 1277 మంది గిరిజన ప్రజానీకం ప్రయోజనం పొందనున్నారు. సమావేశంలో సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, పంచాయతీరాజ్ ఇఇ ఎస్.రాధారాణి, అటవీ రేంజ్ అధికారి జె.తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడంతోపాటు, వాటికి త్వరగా బిల్లులను ఇప్పించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల బిల్లులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని, అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లాలోని రాజాం నియోజకవర్గంతోపాటు, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ నియోజకవర్గాల్లో గ్రామీణ ఉపాధి కన్వర్జెన్సీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, పూర్తి చేసిన పనులకు ఇప్పటికే చాలా వరకు బిల్లులను అప్‌లోడ్ చేశామన్నారు. ఇంకా మరికొన్ని విభాగాల్లో బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వాటిని కూడా అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే, వివిధ శాఖలు సమన్వయంతో, వెంటవెంటనే పరిష్కరించుకొని, యుద్ధప్రాతిపదికన 24 గంటల్లో బిల్లులన్నీ అప్‌లోడ్ చేసేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, విజయనగరం డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, మన్యం జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ, రెండు జిల్లాల వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ ఎపిఒలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు, రైతు సంఘం నాయకులు

పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఒక్క పూటే పనులు పెట్టాలి
- రూ.600 కూలి ఇవ్వాలి
- సిఐటియు, రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి -బలిజిపేట

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, రైతు సంఘం నాయకులు జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని తుమరాడ వద్ద గల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం వామపక్షాలు, ప్రజా సంఘాలు పోరాటాల ఫలితంగా వచ్చిందని, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్నీ నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని అన్నారు. అందులో భాగమే ఎన్ఎమ్ఎమ్ఎస్ యాప్ తీసుకొచ్చి రెండు పూటలా హాజరు ఫొటో విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ కూలీలతో బలవంతంగా ఉపాధి పనులు చేయిస్తున్నారని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ఉపాధి పనుల్లో గతంలో టెంట్లు, గడ్డపార, గుణపాము, మంచినీటికి నిధులు ఇచ్చేవారని, వేసవిలో సమ్మర్ అలవెన్స్ మార్చిలో 30 శాతం, ఏప్రిల్, మే, జూన్‌లో 50శాతం ఇచ్చేవారని, ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదని అన్నారు. బడ్జెట్లో భారీగా నిధులు తగ్గించారన్నారు. కాంట్రాక్టులకు కార్పొరేట్లకు ఉపాధి నిధులు అప్పజెప్తున్నారని, ఉపాధి హామీని రక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు : పిఒ

ప్రజాశక్తి - సాలూరు/పాచిపెంట

విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఏరియా ఆసుపత్రి, బంగారంపేట కాలనీలో మలేరియా స్ప్రేయింగ్‌ను, కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షలు తప్పిన విద్యార్థులకు ఇస్తున్న తర్ఫీదును పరిశీలించారు. తొలుత ఏరియా ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని ఆర్ఎంఒ రత్నకుమారిని ఆదేశించారు. సిబ్బంది విధులు నిర్వహణ పట్ల ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తున్న ప్రజలకు సంతృప్తికర వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పట్ల ఆరోపణలు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. మలేరియా స్ప్రేయింగ్‌ను పరిశీలించిన పిఒ గృహం లోపల, బయట స్ప్రేయింగ్ చేయించుకోవాలని ప్రజలను కోరారు. దోమలను నివారించేందుకు ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్ప్రేయింగ్‌తో పాటు ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని, పాత్రలను ఖాళీ చేసి ఎండలో బాగా ఆరబెట్టాలని చెప్పారు. దోమ తెరలు కూడా వాడడం అలవాటు చేసుకోవాలని, తద్వారా దోమ కాటుకు గురికాకుండా ఉంటామని ఆయన పేర్కొన్నారు. రక్తహీనత, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన పెంపొందిచుకోవాలని కోరారు. పదో తరగతి తప్పిన విద్యార్థులకు చక్కటి తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ఏ అంశంలో వెనుకబడి ఉన్నారో గ్రహించి అందుకు అనుగుణంగా తర్ఫీదు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆర్ఎంఒ వినతి మేరకు 20 ఫోల్డింగ్ బెడ్లు, ఐదు ఫ్యాన్లను పిఒ అందజేశారు.

అనంతరం పాచిపెంట మండలం గురువు నాయుడుపేట పిహెచ్‌సి, గొలుగు వలసలో ఫ్యామిలీ డాక్టరు వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని మందులు అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు వైద్య శిబిరాలను గ్రామంలో అందరూ వినియోగించు కోవాలని ఆయన కోరారు. కదల్లేని స్థితిలో ఉన్న బాధితులకు ఇంటి వద్ద వైద్య సేవలు అందించాలని అన్నారు. గర్భిణీలు, రక్త హీనత కలిగిన వారిని గుర్తించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. రక్త పోటు, మధు మేహం, కేన్సర్ తదితర సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత వైద్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రశాంతంగా అంగన్వాడీ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల ఇంటర్వ్యూలు ప్రశాంతంగా ముగిశాయి. డిఆర్ఒ జె.వెంకటరావు అధ్యక్షతన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథరావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయగౌరి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజన్లలోని మైదాన ప్రాంత మూడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీకి గానూ 3 అంగన్వాడీ కార్యకర్తలు, 9 సహాయకులకు నియామకాల కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. అంగన్వాడి కార్యకర్తల పోస్టుకు 15 మంది అభ్యర్థులు హాజరు కాగా, సహాయకులకు 18 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కొమరాడ, పాలకొండ సిడిపిఒలు జి.సుగుణ కుమారి, ఎస్.గీత, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పార్వతీపురంలో ప్రభుత్వ ఐటిఐ, మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాలూరు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురంలో ప్రభుత్వ ఐటిఐలు ఉన్నాయని పార్వతీపురంలో లేదని తెలిపారు. అలాగే పార్వతీపురం జిల్లా కేంద్రంలో మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

లింగ నిర్ధారణ పరీక్షలు నివారించాలి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

లింగ నిర్ధారణ పరీక్షలు నివారించేందుకుకఠిన చర్యలు తీసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో (పిసి అండ్ పి ఎన్‌డిటి) లింగనిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం అమలుపై కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ఏ ఒక్క స్కానిగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరగకూడదని, వైద్యాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టం కఠినంగా అమలు చేయడం ద్వారా ఆడ, శిశు భ్రూణ హత్యల నియంత్రణ, బాలికల లింగ నిష్పత్తి పెంచేందుకు దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ఆడ, మగ అనే వివక్షను రూపుమాపా లన్నారు. అనుమానిత లేబరేటరీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అందుకు పోలీస్ సహకారం తీసుకోవాల న్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలకు ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. ఎక్కువగా గిరిజన ప్రాంత ప్రజలకు లింగ నిర్ధారణ చట్టం అమలుపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయిలో స్వచ్ఛంద సంస్థలు విస్తతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డిఎండిహెచ్ఒ డాక్టర్ కె.విజయ పార్వతి, డిఎస్‌పి వి.కృష్ణారావు, సిఐ మురళి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ జి.నాగభూషణరావు, న్యాయ నిపుణులు వై.లక్ష్మీనాయుడు, ప్రభుత్వ వైద్యులు జె.రవీంద్ర కుమార్, ఎస్ఐ నీలకంఠం, సామాజిక కార్యకర్త వై.దుర్గారావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పండగ ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈనెల 28 నుంచి 30 వరకు పార్వతీపురం పట్టణంలో నిర్వహించే ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచెమ్మ గ్రామ దేవత పండుగ సందర్భంగా మంచినీటి సరఫరా, పోలీసు బందోబస్తు, విద్యుత్, ఊరేగింపు, దర్శనాలకు చేయాల్సిన ఏర్పాట్లు, తదితర అంశాలపై శాఖల వారీగా తీసుకున్న చర్యలను ఆర్‌డిఒ కె.హేమలత శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు అధిక సంఖ్యలో ప్రజలు రానున్న సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాల ప్రకారం శాఖల వారీగా పట్టణంలో కావాల్సిన మౌలిక వసతుల ఏర్పాటులో అన్ని శాఖలు, ఆలయ కమిటీలు కలిసి సమన్వయంతో పనిచేసి పండుగను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రముఖుల దర్శనాల సమయంలో సామాన్య భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకూడదన్నారు. విద్యుత్ అధికారులు పండుగ మూడురోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. స్థానిక తహశీల్దారు ముఖ్యుల దర్శనాలకు ఏర్పాట్లు చూసుకోవాలని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ రథాలు తిరిగే రూట్లలో రోడ్డు మరమ్మతు, పార్కింగు, రవాణా సదుపాయాలు, వైద్యశిబిరాల ఏర్పాట్లపై సమీక్షించారు. మున్సిపల్ కమిషనరు జె.రామఅప్పలనాయుడు మాట్లాడుతూ మంచినీటి సరఫరా కోసం తోటపల్లి రిజర్వాయరు నుంచి నీరు విడుదల చేశామని, శానిటేషను పనులు పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు కలిసి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పండగ మూడురోజులు మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంపుహౌస్ వద్ద కరెంటు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, శానిటేషన్‌కు అవసరమైన అదనపు సిబ్బందిని తీసుకొచ్చామని కమిషనర్ తెలిపారు. సిఐ కృష్ణారావు మాట్లాడుతూ బందోబస్తుకు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని, ఊరేగింపు రూటు, సాధారణ ప్రజల ఆలయ దర్శనాలు, ముఖ్యుల దర్శనాల్లో ఇబ్బందుల్లేకుండా పోలీసు అధికారుల పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. పండుగ నిర్వాహకులు అందించిన ఊరేగింపు రూటు మ్యాపు ప్రకారం సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు బి.జయబాబు, బి.సీతారాం, దేవాదాయ, వైద్య ఆరోగ్య, విద్యుత్, రోడ్లు, భవనాలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమలు మాయ... ఉపాధి భ్రమ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలో ప్రభుత్వ భూములకు, సాగునీటి వనరులకు కొదవలేదు. కష్టపడే మనస్తత్వంగల జనం కోకొల్లాలు. పరిశ్రమల స్థాపనకు ఇంతకు మించి ఇంకేం కావాలి. అయినా సరే... మన జిల్లా పారిశ్రామికాభివృద్ధిలో అత్యంత వెనుకబడి ఉంది. పాలకుల్లో చిత్తశుద్ధిలోపించడమే ఇందుకు కారణం. ఓవైపు రియల్‌ఎస్టేట్ రంగం ఆకాశాన్ని అంటుతున్నా పట్టుమని పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు రావడం లేదంటే ఉమ్మడి జిల్లాలపై స్థానిక పాలకులకు ఉన్న శ్రద్ధ, పాలకుల ముందు చూపు ఏపాటిదో వేరేగా చెప్పనక్కర్లేదు. అలాగని పూర్వం నుంచీ ఉన్న పరిశ్రమలైనా మనుగడలో ఉన్నాయా? అంటే అటువంటి పరిస్థితీ కనిపించడం లేదు. ఇంతకీ ఇప్పుడెందుకు ఈ చర్చ అంటారా...? ఇదిగో పులి... అదుగో మేక అన్నట్టుగా జిల్లా పరిశ్రమల స్థాపనపై చర్చనడుస్తుండడమే ఇందుకు కారణం. ఇటీవల డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రొమోషన్ కమిటీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. పరిశ్రమల స్థాపనకు సకాలంలో అనుమతులివ్వాలని ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలు, ప్రకటనలు చూస్తుంటే జిల్లాకు ఏవో కొత్తకొత్త పరిశ్రమలు వస్తున్నట్టుగా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నట్టుగా ఉన్నాయి. కానీ, ఎక్కడ ఏ పరిశ్రమ పెడుతున్నారు? వాటికి ఎంత భూమి కేటాయించారు? పెట్టుబడులు ఎంత? వాటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతమందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కలుగుతాయి. పెట్టుబడిదారులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ ఎంత? అన్న విషయాలు ఎక్కడా కనిపించలేదు. పైపైనే చర్చిస్తున్నారా? దాపరికం వహిస్తున్నారా? ఇవన్నీ ప్రజలకు ఎందుకు చెప్పడం అనుకుంటున్నారా? అన్నది కాస్త పక్కనబెడితే... ఉపాధి, ఉద్యోగాల కోసం మాత్రం జిల్లాలోని జనం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి జిల్లా నుంచి వలసలు తప్పడం లేదు. వివిధ వృత్తులు కూడా కనుమరుగవ్వడంతో పొట్టచేతపట్టుకు వివిధ పనులకోసం వివిధ ప్రాంతాలకు వలసపోతునే ఉన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ వంటి విద్యను అభ్యసించినవారు విశాఖ, హైదరాబాద్, బెంగళూర్ తదితర మహానగరాలకు వెళ్తున్నారు. మరోవైపు జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మంచి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3శాతంకాగా, 2018-19లో 17.6శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9శాతానికి పడిపోయింది. బొబ్బిలి గ్రోత్ సెంటర్, సారిపల్లి, కంటకాపల్లి, విజయనగరంలోని విటి అగ్రహారం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలకు కేటాయించిన స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా స్థిరమైన ఉపాధిని కల్పించే పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పాలకులు, జిల్లా అధికార యంత్రాంగం కృషిచేయాలని జనం కోరుతున్నారు.



వీరఘట్టం : మహిళలకు పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పెదబోగిలిలో గడపగడపకు..

ప్రజాశక్తి - సీతానగరం

గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం మండలంలోని పెదబోగిలిలో రెండోరోజు శనివారం కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఘన స్వాగతం నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా జోగారావు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు, ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.
వీరఘట్టం: తమ గ్రామంలోని వంతెనకు నిర్మించిన అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని మండలంలో కిమ్మి గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే వి కళావతి వద్ద గ్రామస్తులు గోడు వినిపించారు. కాలువలు నిర్మించకపోతే కురుస్తున్న వర్షాలు వల్ల వరద నీరు అంతా గ్రామంలోనికి చేరిపోయి చెరువును తలపించే ప్రమాదం ఉందన్నారు. నూతనంగా గృహాలు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యే కళావతి వద్ద విన్నవించుకున్నారు. అనంతరం ఆమె గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి రామ్మోహనరావు, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, జెడ్పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షులు పి విజయ కుమారి, మాజీ సర్పంచ్ జి వెంకటరమణమూర్తి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

బోగస్ ఎస్‌టి కుల ధ్రువపత్రంపై విచారణ

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలానికి చెందిన పూర్ణచంద్ర దులయ్ ఎస్‌టి బోగస్ కుల ధ్రువ పత్రంపై శనివారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి నగేష్ ఆధ్వర్యంలో పిఒ ఛాంబర్‌లో విచారణ చేపట్టారు. కుల ధ్రువ పత్రాలు పరిశీలించారు. ఈ విచారణలో ఎపిఒ రోశి రెడ్డి, ఏఎస్‌వో ఆర్‌డిఒ, సీతారామయ్య, కంచిలి తహశీల్దార్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్‌జిఒ సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఏపీ ఎన్‌జిఒ డివిజన్ గౌరవ అధ్యక్షులు లిల్లీ పుష్పనాథం అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం దగ్గర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం శ్రేయస్సులో బలోపేతం కావాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అవసరమైతే జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు రంగాచారి, కార్యదర్శి పైల ఈశ్వరరావు, సన్యాసిరావు తదితరులున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

16,17న గిరిజన సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కురుపాం

జూన్ 16,17 తేదీల్లో కురుపాంలో జరగనున్న ఏపి గిరిజన సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్రకార్యవర్గసభ్యులు కె.అవినాష్ పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠాపురంలో శనివారం గిరిజన సంఘం నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. జిఒ 3ను సుప్రీం కోర్టు రద్దు చేసిందని, 1/70 చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తున్నారని, అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు తీసుకొచ్చి గిరిజనులను అడవి నుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తూ గిరిజనులకు చదువు అందకుండా చేయడానికి నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అలాగే అటవీ ఫలసాయాలైన జీడిమామిడి, చింత పండును గిరిజన సహకార సంస్థ పూర్తిగా కొనుగోలు చేయడమే మానేసిందన్నారు. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేశాయని, ఇలా గిరిజన వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకులపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆటువంటి పోరాటాలకు గిరిజన సంఘం జిల్లా మహాసభలు నాంది పలికి ఆ సభల్లో గిరిజనులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రమణ, జిల్లా కార్యదర్శి కొల్లి శ్రీనివాసరావు, కుమార్, వాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, గిరిజనులు పాల్గొన్నారు.
కొమరాడ : కురుపాంలో జూన్ 16,17వ తేదీల్లో జరగనున్న ఏపి గిరిజన సంఘం జిల్లా 7వ మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు మండంగి ప్రసాదు, కె.బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కూనేరు సంతలో ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ మైనింగ్ పేరుతో కొండలన్ని కార్పొరేట్ పెట్టు బడి దారులకు అప్పజెప్పి గిరిజనులను కొండలపై హక్కులు లేకుండా ప్రయత్నిస్తున్నారని, ఈ దుర్మార్గాన్నింటిని వైసిపి ప్రభుత్వం అంగీకరిస్తుందన్నారు. గిరిజనులు వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఇంకా కొన్ని తీర్మానాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కావున జూన్ 16, 17 తేదీల్లో కురుపాంలో జరిగే గిరిజన సంఘం జిల్లా 7వ మహాసభలను జయప్రదం చేయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజనులు రామారావు, సుబ్బారావు, లక్ష్మణరావు, వెంకట్రావు, రాము, చిన్నారావు, గిరిజనులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెరువులో పడి బాలిక మృతి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని కొండాపురం గ్రామంలో శనివారం చెరువులో పడి 9 సంవత్సరాల బాలిక కుడుతుల లావణ్య మృతి చెందింది. స్నేహితులు, అక్క గౌతమితో కలిసి వేసవిలో ఏటా చెరువులోకి వెళ్లి స్నానం చేయడం అలవాటు. అదే అలవాటుగా శనివారం కూడా చెరువులో స్నానానికి దిగి మునిగిపోయింది. చుట్టు ఉన్నవారు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. తండ్రి సురేష్ తాపీమేస్త్రీ కాగా, తల్లి న్నపూర్ణ గృహిణి. లావణ్య కొండాపురం పాఠశాలలో 3వ తరగతి చదువుతుంది. గ్రామంలో ఈ సంఘటన జరగడంతో విషాధఛాయలు అలముకున్నాయి.

మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ గ్రామ సమీపన ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో చెముడుగూడ గ్రామానికి చెందిన ప్రవీణ్ నడుముకు, మండ గ్రామానికి చెందిన కిల్లక గోవింద్ తలకు తీవ్ర గాయమైంది. కురుపాం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు వస్తున్న బైకు గుమ్మ లక్ష్మీపురం నుంచి కురుపాం వైపు వెళుతున్న బైక్ ఎదురెదురుగా ఢీకొడంతో ఈ సంఘటన జరిగింది. గాయపడిన వారిని జిల్లా కేంద్రం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎల్విన్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆరోగ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించడం, పండిన పంటలను సొంతంగా వినియోగించుకోవడం వల్ల సుస్థిర ఆరోగ్యం సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు, గొరడ ఆర్‌బికెల పరిధిలో గల 70 మంది గిరిజన రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం పంటలను తినడం వల్ల సుగర్, బిపి, రక్త హీనత మొదలగునవి దరి చేరకుండా ఉంటాయన్నారు. భూమిని సారవంతం చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేయడం, ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభించడం ఈ నవధాన్యాలతో సాధ్యపడుతుందని అన్నారు. అధిక దిగుబడులు సాధించడానికి వీలుంటుందన్నారు. తొలకరి వర్షాలకు ముందు ఎకరానికి 10 కేజీలు చొప్పున, వివిధ రకాలైన విత్తనాలు 20 నుంచి 30 రకాలు వేసుకోవడం వల్ల



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న షణ్ముకరాజు

భూమికి అన్ని రకాల సమృద్ధికరంగా పోషకాలు లభిస్తాయని తెలిపారు. పంటలు బాగా ఆశించిన పరిమాణంలో పండుతాయని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. జిల్లాలోని 15 మండలాల్లోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో నవధాన్యాలు ప్రతి రైతు తప్పనిసరిగా వేసుకొనేలా సంబంధిత కార్యకర్తలు అందుబాటులో ఉండి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. అన్నపూర్ణ, మాతోట, గిరి హారం, భూలక్ష్మి పంటల నమూనాల్లో అంతర్ పంటలు, పలు పంటలు వేసుకోవడం వల్ల ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచడంతో పాటు భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందని, వాతావరణ సమతుల్యత సాధించడం జరుగుతుందని అన్నారు. ఎపిసిఎన్ఎఫ్, జట్టు సంస్థ సంయుక్తంగా గుమ్మలక్ష్మీపురం మండలాన్ని బయోగ్రామాలుగా తీర్చిదిద్ద దానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆరబెల్లో కట్టెలు, జిలుగులు, పిల్లి పెసర విత్తనాలు ముందుగా బయోమెట్రిక్ వేసి ఆర్డర్ చేసుకోవాలని, ఈ విత్తనాలతో పాటు తమ వద్ద ఉన్న మిగతా రకాల విత్తనాలను కలుపుకొని నవధాన్యాలుగా సిద్ధం చేసుకుని తొలకరి వర్షానికి ముందుగా వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జిలు ఎం.సీతారాం, పి.జగదీష్, మన్మథరావు, విఎలు పి.శ్రావణి, ఎన్.లత రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు తగవు

ప్రజాశక్తి - సాలూరు

రాజధాని కోసం భూములిచ్చిన రైతులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని లోకసత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ అన్నారు. శనివారం ఆయన సంగీత పాఠశాల జంక్షన్ వద్ద మెడికల్ షాపులో విలేకరులతో మాట్లాడారు. వేలాది ఎకరాల భూములను రైతులు ఇచ్చారని, వారిని ఇబ్బందుల పాలు చేసే విధంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని చెప్పారు. అమరావతి రైతులు, సమీప గ్రామాల పేదల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. రాజధాని కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని తప్పుపట్టారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారులు మౌనం వహిస్తుండడం సరికాదని అన్నారు. వాస్తవాలు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని చెప్పారు. అధికారం ఏ రాజకీయ పార్టీకి శాశ్వతం కాదని అన్నారు. ఈ సమావేశంలో కేన్సర్ సాధన సమితి జిల్లా నాయకులు పి.నరేష్ కుమార్ వున్నారు.

సర్పంచ్‌కు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామాభివృద్ధే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న గుమ్మలక్ష్మీపురం గ్రామ సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్ రావు సేవలను గుర్తించి దోస్త్ మేరా దోస్త్ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ సారి సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఉన్న ప్రతి సమస్య పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. పొద్దు పొడిచిన నుండి పొద్దు పోయేవరకు నిరంతర క్రమశిక్షణ కష్టపడే వ్యక్తిత్వం ఆయనదన్నారు. తాగునీరు, విద్యుత్, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజారోగ్య పరిరక్షణలో ఆయన కృషికి ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా గుర్తింపు పొందడం కూడా మనందరికీ గర్వకారణమన్నారు. ఈయన సేవలు పలువురికి ఆదర్శంగా నిలవాలని కోరారు.



సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

నర్సిపురంలో వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో శనివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు నర్సిపురం, గంగాపురం, బందలుప్పి, పెదబొండపల్లి, ఎంఆర్ నగరం, చినబొండపల్లి, వెంకంపేట, బాలగుడబ సచివాలయాల వాలంటీర్లకు పురస్కారాలు ప్రధానం చేసి, ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా నిలిచి ప్రజాసంక్షేమాన్ని ప్రజలకు మరింత చేరవేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, నాగేశ్వరరావు, వైస్ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, సర్పంచులు చెరుకుబిల్లి బంగారమ్మరాజు, యాళ్ల ప్రతాప్, సవరాపు తవుడమ్మ రాజారావు, తీళ్ల కృష్ణారావు, సిహెచ్ వెంకట నాయుడు, గండి శంకరరావు, వై.ఉషారాణి, పైల సూరిబాబు, పండు, ఎంపిటిసిలు బడే రామారావు, బంకూరు రవికుమార్, మండల వైసిపి సీనియర్ నాయకులు వి.గురురాజు, భీమవరం కృష్ణమూర్తి, మడక విశ్వనాధం, మువ్వల సత్యంనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ కాపారపు సత్యం నాయుడు, తెర్లి రామస్వామి, కోట సంజీవి, రెడ్డి అప్పలస్వామి, ఎంపిడిఒ విజయలక్ష్మి, ఇఒపిఆర్‌డి, గ్రామ కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు,



పార్వతీపురం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

సచివాలయం ఉద్యోగులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.
కొమరాడ : వాలంటీర్లు అందరూ సేవకులు కాదనని, జగనన్న సైనికులని ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేరవేసే పనిలో వాలంటీర్ల పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శరత్‌బాబు, అన్నపూర్ణ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన్‌నాయుడు వైసిపి సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, సింహాచలంనాయుడు, పంచాయతీ కార్యదర్శుల పాల్గొన్నారు.

మేనేజర్ పోస్ట్ భర్తీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఇ - డిస్ట్రిక్ట్ మేనేజర్ పోస్టును కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో ఒక పోస్ట్ ఖాళీ ఉందన్నారు. బిసిఎ, బిఎస్‌సి, బిఇ, బి.టెక్ డిగ్రీ లేదా పోస్టు గ్రాడ్యుయేట్ అర్హత కలిగి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. 2022 జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. నెలకు రూ.22,500 వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టు కాలపరిమితి ఒక సంవత్సరమని, అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. రెండేళ్లలో ఐటి సెక్టార్‌లో పనిచేసిన అనుభవం కలిగిన వారికి 5 శాతం వెయిటేజ్ మార్కులు కల్పిస్తామన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 7 లోగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని, లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించాలని తెలిపారు. parvathipurammanyam.ap.gov.in వెబ్సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేయవచ్చని ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా అధికారులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించినా లేదా నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినా వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

చిన్నారుల ఆరోగ్య పట్ల ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన శనివారం మర్కొండపుట్టి, చంద్రంపేటను సందర్శించారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోనూ, రెండేళ్లలోపు పిల్లలను గృహ సందర్శనలు చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. టీకా కార్డులను పరిశీలించి టీకాలు షెడ్యూల్ ప్రకారం వేస్తుందని, తారీఖులను పరిశీలించారు. ముఖ్యంగా మీజిల్స్, రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్ 9 నెలలు నిండిన పిల్లలకు మొదటి డోసు, 16 నెలలు పూర్తైన వారికి రెండో డోసు తప్పనిసరిగా వేయాలని



రికార్డులను తనిఖీ చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

సూచించారు. ఎవరైనా డ్రాప్ ఔట్స్, లెఫ్ట్ ఔట్స్ ఉంటే సర్వే చేసి గుర్తించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిల్లలు వయస్సుకు తగ్గ బరువు ఉండాలని, సంబంధిత గ్రాఫ్ చార్ట్‌ను ప్రతినెలా ఎంసిపి కార్డులో విధిగా గుర్తించాలని అంగన్వాడీ, వైద్య సిబ్బందికి సూచించారు. అలాగే పిల్లలకు ఆయా వయస్సుకు తగ్గట్టు చేయాల్సిన ప్రక్రియలు చేస్తున్నదీ లేనిదీ సిబ్బంది, ఇటు తల్లిదండ్రులు కూడా గమనించాలని, సంబంధిత వివరాలు సులభంగా గుర్తించేలా ఎంసిపి కార్డులో పొందుపర్చ బడ్డాయన్నారు. వారానికి రెండుసార్లు ఐరన్ సిరప్ ద్రావణాన్ని తప్పకుండా ఐదేళ్లలోపు పిల్లలకు వేయించాలన్నారు. వేసవి రీత్యా పిల్లలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కొన్ని అత్యవసర మందులు, ఒఆర్ఎస్ పిల్లల తల్లిదండ్రుల వద్ద ఉండాలని, వినియోగించే పద్ధతులను సూచించాలన్నారు. ఇందులో వైద్య సిబ్బంది జయగౌడ్, పార్వతి, అనూష, లత, రామకృష్ణ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారికి శనివారం తన చాంబర్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, ఎస్. మురళి మోహన్, రాములు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు తెలియజేశారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు నిబంధనలను సవరించాలని దీని కోసం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని కోరారు. బదిలీలకు జీరో సర్వీస్ నుంచి ఎన్ని సంవత్సరాల లాంగ్ స్టాండింగ్ ఉండాలని, మహిళ ఉపాధ్యాయులు ఏ పాఠశాలలోనైనా పనిచేసే విధంగా నిబంధనలు సవరణ చేయాలని కోరారు. సవర భాష వాలంటీర్లు, సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని అన్నారు. పీజీ హెచ్ఎం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్, జిల్లా కార్యదర్శి కె. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పిఒ కల్పనా కుమారిని కలిసిన యుటిఎఫ్ నాయకులు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పంచాయతీ పరిధిలో గల మంతినివలసలో శనివారం అటవీ శాఖ బీట్ అధికారి కె.ఆనంద్ ప్లాస్టిక్ నిషేధంపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, బాటిళ్ల వాడకం పూర్తిగా తగ్గించాలని, వాటిని వాడడం వల్ల భూమిలో కలవకపోవడం జరుగుతుందని అన్నారు. దీనివల్ల ప్రజలకు అనేక వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది రౌతు కోటి, గిరిజన యువత, గిరిజనులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.
కొమరాడ: ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పివిఎస్ శాస్త్రి అన్నారు. మండలంలోని విక్రాంపురం తదితర ప్రాంతాల్లో పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రజలకు పర్యావరణాన్ని పరిరక్షించుకునే సందర్భంలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వే గేట్ సమీపంలో వానదారులకు పలు సూచనలు, సలహాలు చేసి



కురుపాం : ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కె.ఆనంద్

పర్యావరణాన్ని పరిరక్షించుకునే భాగంలో కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల పరిరక్షణకు చెట్లు నాటుకుంటే చాలా వరకూ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు తగ్గించుకుంటే భవిష్యత్తులో మంచి వాతావరణం ఉంటుందన్నారు. ఆదిశగా ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కొమరాడ అటవీశాఖ సెక్షన్ అధికారి ఎస్.గౌరీశంకరరాజు, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- సాలూరు రూరల్

కళలను, కళాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వర రావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బాగు వలసలో ప్రజానాట్య మండలి సభ్యుడు మోహన రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కళలు సామాజిక చైతన్యం కోసం, ప్రజలను మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలును రూపుమాపడానికి ఉపయోగపడతా యన్నారు. పూర్వం నుండి జానపద కళాకారులకు ఎటువంటి ప్రోత్సాహమూ లేకపోవడం వల్ల జానపద కళలు కళారూపాలు మరుగున పడిపోతున్నాయన్నారు. టీవీలు, మొబైల్ ఫోన్లు వచ్చిన తర్వాత గొప్ప ఆరోగ్యవంతమైన జానపద కళారూపాలకు ప్రోత్సాహం తగ్గిపోయిందన్నారు. దీంతో కళారూపాల ద్వారా బతికిన కళాకారులు పొట్ట కూటి కోసం వలసలు పోతున్నారన్నారు. ప్రభుత్వాలు భరతనాట్యం, కూచిపూడి వంటి కలలను ప్రోత్సహిస్తూ పోటీలు పెడుతుందని, ఇటువంటి జానపద కళారూపాలైన కోలాటం, తప్పిట గుళ్ళు, చెక్కభజనలు, డప్పు వాయిద్యాలకు కూడా పోటీలను నిర్వహించి ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రజానాట్య మండలి భవిష్యత్తులో ఆ రకంగా శాస్త్రీయమైన కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడానికి ముందుకు వస్తోందని ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి సభ్యులు కే అప్పారావు, కొమ్మల లక్ష్మణరావు, జి మోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కోరాడ ఈశ్వరరావు

జీపు జాతాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న సాయంత్రం 7 గంటలకు జరుగు రాష్ట్ర ప్రచార జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ కార్మికులతో అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ంలో పారిశుధ్య కార్మికులను కలిసి ప్రచార జాతాను జయప్రదం చేయండి అని కోరారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 010 ద్వారా జీతాలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 31 నుంచి జూన్ 9 వరకు జరిగే రాష్ట్ర ప్రచార జాతాలు జయప్రదం చేయాలని, ఇందులో




మాట్లాడుతున్న గొర్లి వెంకటరమణ

భాగంగా జరుగు జాతకు ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో నాగవంశం శంకరరావు, చీపురుపల్లి సింహాచలం, గంట్రేడి గంగయ్యలు, మామిడి శివ, రాజేష్, మంగళగిరి శ్రీను, మామిడి మజ్జి, అప్పారావు, సుజాత, లక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు.
పాలకొండ రూరల్: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్(ఆప్కాస్) సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ ఇవ్వాలని ఈనెల 31 నుంచి జూన్ 9 వరకు జరిగే రాష్ట్ర ప్రచార జాతాలను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్ (సిఐటియు) పాలకొండ నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సమావేశం సందర్భంగా కరపత్రం ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపడుతున్న జాతా పాలకొండకు ఈనెల 31న రానుందని, కావున మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని, జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వై.హరిబాబు, వై.సురేష్, బి.సురేష్, పడాల సాయి, పేకేటి శ్రీనివాసు, టి.ఈశ్వర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ముగిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం సాదాసీదాగా ముగిసింది. అజెండాలో పొందుపర్చిన అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపించడంతో అధికార పార్టీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. 14వ వార్డు టిడిపి కౌన్సిల్ సభ్యులు ద్వారపు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా అందించడంలో మున్సిపల్ అధికారులు విఫలమ య్యారని ధ్వజమెత్తారు. ఆరేళ్ల తర్వాత పార్వతీపురం జిల్లా కేంద్రంలో అమ్మవారి పండగలు జరుగుతున్నాయని, వీటిని చూసేందుకు లక్షలాది మంది ప్రజలు పట్టణానికి వస్తున్నారన్నారు. తాగునీటి సమస్య ఇలాగే ఉంటే ప్రజలు తాగునీటికి ఇబ్బందులుపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మాట్లాడుతూ పండగ మూడు రోజులు తాగునీటి సరఫరాను పూర్తిస్థాయిలో చేస్తామని, పైపులైన్ లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా అందజేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, అధికారులు ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్రంలోని రజకుల సమస్యలు పరిష్కరించాలని రజక సంఘం నాయకులు కళింగపట్నం సన్యాసిరావు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం రజకుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలోని దోబీఘాట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక రక్షణ చట్టం తీసుకు రావాలని కోరారు. మున్సిపాలిటీల్లో దోబీఘాట్‌లను నిర్మించాలని కోరారు. తెలంగాణా ప్రభుత్వం అమలు చేస్తున్న విధంగా రజకులకు 250యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు వై.గౌరి, కె.సత్యనారాయణ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.